క్లుప్తంగా

ముగిసిన గంగామాత ఉత్సవాలు



ఎమ్మెల్సీకి స్వాగతం పలుకుతున్న మహిళలు

బెజ్జూర్: మండల కేంద్రంలోని మత్స్యకారుల కాలనీలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న గంగామాత ముగింపు ఉత్సవ వేడుకల్లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మత్స్యకారుల కుల సంఘం మహిళలు, పెద్దలు, యువకులు బాజాభజంత్రీలు, మంగళ హారతులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్, నాన్నయ్య, కుర్సింగ ఓంప్రకాష్, రాచకొండ శ్రీవర్ధన్, నహీర్ అలీ, సామల రాజన్న పాల్గొన్నారు.

నేడు బీసీ కమిషన్ సమావేశం

సిర్పూర్(టి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం బీసీ కమిషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. బీసీ కమిషన్ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, ఎన్జీవో సభ్యులు, విద్యావంతులు, మేధావులు, కళాకారులు హాజరు కావాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న వరి ధాన్యం పట్టివేత



పట్టుకున్న వరి ధాన్యం వ్యాన్

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం వద్ద అక్రమంగా తరలిస్తున్న వరిధాన్యం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా.. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వ్యాన్‌లో తరలిస్తున్న 80 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ కోసం పౌరసరఫరాల శాఖకు అప్పగించినట్లు వివరించారు.

కలప స్వాధీనం

బెజ్జూర్: చింతలమానపల్లి మండలం కర్జవెల్లి రేంజ్ పరిధిలోని ముంజంపల్లి గ్రామ సమీపంలోని పలువురి చేనుల్లో నిల్వ ఉంచిన అక్రమ కలపను స్వాధీనం చేసుకున్నట్లు కర్జవెల్లి ఇన్‌చార్జి రేంజ్ అధికారి ఇక్బాల్ తెలిపారు. ఆదివారం దాడులు జరిపి సుమారు రూ.1 లక్ష 50 వేల కలపను పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు హెచ్‌ఎంలకు శిక్షణ

కెరమెరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం ప్రశస్తిపై ఒక రోజు శిక్షణ నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

రెబ్బెన: మండలంలోని గంగాపూర్ శివారులో జర్నలిస్టు కాలనీలో గల ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు, నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని పలువురు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఆదివారం జర్నలిస్టు కాలనీలోని ఖాళీ స్థలంలో టీలా దర్శనమివ్వగా ఎస్సై చంద్రశేఖర్, తహసీల్దార్ రామ్మోహన్‌రావులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న పడకంటి అజయ్‌కుమార్

ఎదులాపురం: 317 జీవో కారణంగా ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు బలవంతంగా నెట్టివేయబడిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర 317 జీవో డిస్లోకేటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పడకంటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీవోతో ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. జీవోతో జిల్లాలు మారిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను తిరిగి సొంత జిల్లాకు పంపడంలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, రత్నమాల, మధుకర్‌రెడ్డి, అజయ్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.



లింగాపూర్: సంప్రదాయ దుస్తులతో యువకులు



కెరమెరి: పాటలు పాడుతున్న కళాకారులు

దండారీ సంబురాలు..

గిరిజన పల్లెల్లో దండారీ సంబురాలు ప్రారంభమయ్యాయి. డప్పు చప్పుళ్లు.. కాళ్లకు గజ్జెలు.. చేతిలో దుడ్డు.. చంకలో జింక చర్మం.. సంప్రదాయ నృత్యం చేస్తూ.. అడుగులో అడుగువేస్తూ.. చేసిన నృత్యం ఆకట్టుకుంటున్నాయి. కెరమెరి మండలంలోని పెద్దసాకడ గ్రామంలో ఆదివారం గుస్సాడీ నృత్యం ఆకట్టుకుంది. చిన్నసాకడ దండారీకి పెద్దసాకడ దండారీ అతిథ్యమిచ్చింది. లింగాపూర్ మండలంలోని జాముల్‌ధరా, కంచన్‌పల్లి, చోర్‌పల్లి, నాగుగుడా, లోద్దిగుడా, దంపూర్, కొత్తపల్లి, మాన్కుగుడా, మామిడిపల్లి గ్రామాల్లో దండారీ సంబురాలు ప్రారంభమయ్యాయి. ఆదివాసీ గూడేల్లో భోగి యత్మాదేవతకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. దప్పుచప్పుళ్లకు ఆదివాసీలు చేసిన నృత్యాలు అలరించాయి. – కెరమెరి/లింగాపూర్



లింగాపూర్: గుస్సాడీలతో గ్రామస్తులు



కెరమెరి: వాయిద్యాలు వాయిస్తున్న ఆదివాసీలు



కెరమెరి: నృత్యం చేస్తున్న గుస్సాడీలు



లింగాపూర్: పూజలు చేస్తున్న పూజారులు

పత్తి పంట దుమ్ముపాలు..!

- కంకర, మట్టిరోడ్డుతో లేస్తున్న దమ్ము
- పంట ఎదుగుదలపై ప్రభావం
- ఆందోళన చెందుతున్న రైతులు



కంకర లేచిన టోకెన్‌మొవాడ్ రోడ్డు



పత్తి మొక్కలపై పేరుకుపోయిన దుమ్ము

కెరమెరి: పత్తి ఎదుగుదలపై దుమ్ము ప్రభావం చూపుతోంది. రోడ్డు నిర్మాణం పనులు నిలిచిపోవడంతో పత్తిపై దుమ్ముదూళి పేరుకుపోతోంది. దీంతో పత్తికి అనుకున్న ధర రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సగం వరకే రోడ్డు నిర్మించారు. అటవీ అధికారుల అనుమతి లేదని రోడ్డు నిలిపివేయడం జరిగింది. దీంతో ప్రజలు, రైతులకు తిప్పలు తప్పడం లేదు. మండలంలోని జోడేఘాట్ నుంచి హట్టి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం టోకెన్ మోవాడ్ వరకు మాత్రమే చేపట్టడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. టోకెన్ మోవాడ్ నుంచి హట్టి వరకు సుమారు ఆరు కిలో మీటర్ల ఉన్న రోడ్డు నిర్మాణం లేక పోవడంతో మరింత ఘోరంగా మారింది. వాహనాలు రాకపోకలతో దుమ్ము, ధూళితో పక్కనున్న పంటలపై పడడంతో పంటలు దెబ్బతింటున్నాయి. అంతేకాకుండా పంట ఎదుగుదల నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షంతో పత్తి దెబ్బతినగా.. మిగిలిన పత్తికి ధర వస్తుందనుకుంటే దుమ్ము, ధూళితో సగం ధర కూడా రావడం లేదని వాపోతున్నారు.

నాణ్యత కోల్పోనున్న పత్తి..

ఇప్పటికే చాలా చోట్ల రోడ్డు ఇరువైపులా ఉన్న పత్తి పొలాల్లో పత్తి పగిలింది. వాహనాల రాకపోకలతో లేచే దుమ్ము పత్తిపై పడడంతో రంగు మారుతోంది. దీంతో మార్కెట్లో సరైన ధర పంటకు రావడం లేదు. టోకెన్ మోవాడ్ నుంచి హట్టి వరకు అనేక ఎకరాలు సాగు భూమి ఉంది. ప్రధానంగా పత్తి పంటతో పాటు అంతరపంటగా కంది వేశారు. కానీ ప్రస్తుతం దుమ్ము, ధూళి వల్ల కొంత పంట నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో చాలాసార్లు మిగిలిన రోడ్డును పూర్తి చేయాలని అధికారులను వేడుకున్న ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి



టోకెన్ మోవాడ్ నుంచి హట్టి వరకు నిలిచిన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలి. అటవీ అనుమతి లేదని అధికారులు నిర్మాణానికి అనుమతి ఇవ్వక పోవడం విడ్డూరం. సమీపంలోని పంట పొలాలు దెబ్బతింటున్నాయి. ఫలితంగా అనుకున్నంత ధర పలికే ఆస్కారం లేదు.

– పెందోర్ రాజేశ్వర్, జోడేఘాట్

కనక దుర్గాదేవి ఆలయంలో పూజలు



అమ్మవారి దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులు



మహంకాళి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లోని కనక దుర్గా దేవి, స్వయంభూ మహంకాళి ఆలయానికి ఆదివారం అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మంచిర్యాల జిల్లా తాండూర్ సీఐ కుమారస్వామి కుటుంబసభ్యులతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులుదీరారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న మహంకాళి విగ్రహం, శనేశ్వరుడు, కాల భైరవస్వామి, శివలింగాలను దర్శించుకున్నారు.

పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి



నియామకపు పత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: పద్మశాలి సేవా సంఘం అభివృద్ధికి కృషి చేస్తాననని సంఘం పట్టణ అధ్యక్షుడు అనుమాండ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఆలె శ్రీకాంత్‌లు అన్నారు. ఈనెల 18న నిర్వహించిన సంఘం ఎన్నికల్లో ఏకగ్రీంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులకు ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో జిల్లా ప్రతినిధులు నియామకపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇరుకల అంజనేయులు, చెన్నూరి ప్రకాష్, మధుకర్, రవీందర్, లింగయ్య, ఇరుకుల మంగ, తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కౌటాల మండలంలోని విజయనగరం సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2006-07 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ.. సందడిగా గడిపారు. అనంతరం పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు మారయ్య మాట్లాడుతూ.. జీవితంలో విద్యార్థి దశకు ఎంతో ముఖ్యమైందని, భవిష్యత్‌ను నిర్ణయించేది ఈదశ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఇంద్ర, అలీ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు. - కౌటాల

మరాఠీ భాష అభివృద్ధికి కృషి చేయాలి



డీఎస్సీలో కొలువులు సాధించిన, ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: మరాఠీ భాష అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని మరాఠీ బాషిక్ జన కల్యాణ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుభాష్ రాథోడ్, అనిల్ సావులే అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌజింగ్‌బోర్డు సరస్వతి శిశు మందిర్‌లో మరాఠీ మీడియం ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడులేని విధంగా డీఎస్సీలో 21 మంది ఉపాధ్యాయులకు అవకాశం కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత కాలంలో మరాఠీ మీడియంకు ఆదరణ తగ్గిందని, ఇలాంటి తరుణంలో పలువురు ఉపాధ్యాయులు మరాఠీ అస్తిత్వాన్ని భావితరాలకు అందించేందుకు డీఎస్సీలో రాణించి ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. బేలలో మరాఠీ మీడియం కళాశాల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. మరాఠీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన, ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్ గుర్నాలే, సుభాష్, మనోహర్, విజయ్, శివాజీ, విఠల్, బాపురావు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న సుగుణ, నాయకులు

ఉట్నూర్‌రూరల్: కుమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఆదివారం మండలంలోని దొంగచింత గ్రామంలో కుమురం భీం, కుమురం సూరు వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భీం, సూరు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాడి అమరులైన మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆదివాసీ గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

కౌటాల: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. మంచిర్యాల జిల్లాకు చెందిన ఉర్వత్ కమల, మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన శోభాబాయితో కలిసి బైక్‌పై మొగడ్‌దగడ్ గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరికి చేతికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆర్టీసీ బస్సును వెంబడించి నిలదీయగా డ్రైవర్ బాధితులపైనే దురుసుగా ప్రవర్తించాడు.

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న ఉద్యమకారులు

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం ప్రెస్‌మీట్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యమిస్తూ, వారి సమస్యలను తీరుస్తామన్నారు. ఉద్యకారులకు బోర్డు ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలు హెల్త్‌కార్డులు, ఫ్రీబస్సు సౌకర్యం, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు సురేశ్, అప్పాల శ్రీనివాస్ రెడ్డి, సంగు స్వామి, బ్రహ్మానందం, తక్కల శ్రీనివాస్ రెడ్డి, గంగయ్య, ఆనంద్, సమీర్, రవూఫ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బేల: మండలంలోని సాంగిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తిరుమల చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదిలాబాద్ చెందిన ప్రముఖ వైద్య నిపుణులు సందీప్‌రెడ్డి, రంజిత్‌కుమార్, సాయికృష్ణ, ఇంద్రజ 300కు పైబడి రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ అనిల్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.